చిత్తూరు జిల్లాలో

# ఏనుగుల ప్రభుత్వం




ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం (APCLC)

# చిత్తూరు జిల్లాలో ఏనుగుల ప్రభుత్వం

ప్రభుత్వ యంత్రాంగం, పెత్తందార్లు చేసే ప్రత్యక్షమయిన దాడులవల్లనే కాక, ప్రభుత్వం అనుసరించే ప్రజావ్యతిరేక రాజకీయార్థిక విధానాలవల్ల, నిర్లక్ష్యంవల్ల కూడ ప్రజల జీవితానికి జీవనానికీ తీవ్రమయిన హాని కలుగుతూ ఉంటుంది.

చిత్తూరుజిల్లా అడవి ఏనుగుల సమస్య, కర్నూలు-మహబూబ్‌నగర్ జిల్లాల పులుల సమస్య ఈ కోవకు చెందిన పౌరహక్కుల సమస్యలు.

చిత్తూరు జిల్లాలోని కుప్పం, పలమనేరు అడవి ప్రాంతం చాలా అందమయిన ప్రాంతం. ఎత్తయిన పీఠభూమి మీద వున్న ఎగుడుదిగుడు నేల, విస్తారమయిన చిట్టడవి, సమృద్ధిగా కురిసే వర్షం, ఆ వర్షంనీటికి ప్రవహించే వాగులు, ఆ నీటిని నిలుపుకొనే చిన్నచిన్న మడుగులు, పెద్ద నీటివనరులేవీ లేకపోయినా ఎప్పుడూ పచ్చగా వుండే పొలాలు - ఇక్కడ మనుషులు తమకు తాము కష్టాలను కల్పించుకుంటే తప్ప కష్టాలనేవి ఉండనక్కర లేదనిపిస్తుంది ఈ నేలను చూస్తే. వడ్లు, చెరుకు, పప్పుధాన్యాలు, రాగులు, వేరుశెనగ, కొబ్బరి, రకరకాల పండ్లు ఈ నేల ఇచ్చే ఫలం. అడవి అని పేరేగానీ అది క్రూరమృగాలు సంచరించేంత దట్టమయిన అడవి కాదు. అంతకంటే క్రూరమయిన అటవీ శాఖకు పెద్దగా అక్కరకు వచ్చే అడవీ కాదు. ఈ అడవిలో గంధం చెట్లు బాగా ఉండేవి. అవి స్మగ్లర్ల వాతబడి దాదాపు మృగ్యం అయిపోయాయి. టేకుప్లాంటేషన్లకు యోగ్యమయిన అడవి కాదు కాబట్టి ఖరీదయిన కలప ఇక్కడ పెద్దగా దొరకదు. కాబట్టి అటవీశాఖ బెడద అంతగా లేదు.

సామాజికంగా రాజకీయంగా ఇది బాగా వెనకబడ్డ ప్రాంతం. వందల ఎకరాల భూములున్న భూస్వాములు సహితం గ్రామాలను అంటిపెట్టుకునే బ్రతుకుతున్నారు. పట్టణ ఆర్థిక వ్యవస్థలోనికి రాష్ట్ర రాజకీయాలలోనికీ ఎక్కువగా ప్రవేశించలేదు. అసలు పెద్ద భూస్వాముల సంఖ్యే తక్కువ.

ఏ ఒడిదుడుకులూ లేకుండ సాగిపోతున్న ఈ జీవితంలోనికి 1984లో ఏడు అడవి ఏనుగుల మంద ఒకటి ప్రవేశించింది.

> ***1984 దాకా చిత్తూరు అడవులలో అసలు ఏనుగుల సంచారమే లేదు .........***
>
> *ఫ్రెంచినగల వ్యాపారి, పర్యాటకుడు అయిన జె.బి. టావర్నియర్ క్రీ.శ. 1652 ఆగస్టు నెలలో ఈ అడవుల గుండా ప్రయాణించాడు ... ఆ రోజులలో ఈ కొండలలో ఏనుగుల వేట జరిగేదని ఆయన రాసాడు. మీర్‌జుమ్లా సైన్యానికి చెందిన ఒక అధికారి ఈ అడవులలో ఏనుగులను వేటాడేవాడని ఆయన రాశాడు. ఇప్పుడు ఈ అడవుల స్థితిగతులలోనూ ఇక్కడున్న జంతుజాలులలోనూ పరిచయం ఉన్న వాళ్లకు ఇది నమ్మశక్యంగా అనిపించదు.... ఏనుగులు, అడవిదున్నల వంటి పెద్ద జంతువులే కాదు, పులులు చిరుతల వంటి జంతువులు సహితం ఇప్పుడు ఈ అడవులలో మృగ్యం అయిపోయాయి.*
>
> ***చిత్తూరు జిల్లా గెజెటేర్ (1979)***
> ***(రాష్ట్ర ప్రభుత్వ ప్రచురణ)***

పొరుగున వున్న హెసూరు (తమిళనాడు) అటవీ డివిజన్ నుండి ఈ మంద చిత్తూరులోనికి ప్రవేశించింది. ప్రథమంగా కుప్పం అటవీ డివిజన్‌లోని పెద్దూరు అడవులలో కనబడింది. ప్రజలు వాటికి కొబ్బరి కాయలు కొట్టి మంగళహారతులు ఇచ్చారు. రెండవమంద 1986లో ఇదే రేంజిలోనికి ప్రవేశించింది. అందులో 22 ఏనుగులున్నాయి. ఆ తరువాత ఏనుగుల సంఖ్య నెమ్మదిగా పెరుగుతూపోతూవుంది. ప్రస్తుతం 40 దాకా ఉన్నాయని ప్రభుత్వం భావిస్తూవుంది. ప్రజలలో కొందరు ఇంకా ఎక్కువ ఉన్నాయంటారు.

ఇవి ఎందుకు వచ్చాయి?

చిత్తూరులోనికి ఈ ఏనుగులు తమిళనాడు నుండి వచ్చాయని చెప్పాం. అయితే అసలు ఇవి కర్నాటక రాష్ట్రంలోని మైసూరు

ప్రాంతంనుండి వలస బయలుదేరి తమిళనాడు మీదుగా చిత్తూరు అడవిలోనికి ప్రవేశించాయని నమ్మడానికి ఆధారాలున్నాయి. ఈ వలసకు ప్రధాన కారణం అడువుల నాశనం. ఒక ఏనుగుల మంద జీవించడానికి అవిచ్ఛిన్నమయిన విస్తారమయిన అడవి కావాలి. ఎదిగిన ఒక ఏనుగు రోజుకు 270 నుండి 320 కిలోల ఆహారం (ఆకులు, మొక్కలు మొదలయినవి) తీసుకుంటుంది. ఒక ఏనుగును పోషించడానికి సగటున 25 ఎకరాల సారవంతమయిన అడవి కావాలి. ఇంత తిండి ప్రతీ రోజు ఒకే చోట దొరకదు కాబట్టి ఏనుగులు విశాల భూభాగంలో సంచరిస్తూ బ్రతుకుతాయి. ప్రతీరోజూ దాదాపు 60 నుండి 80 చదరపు కి.మీ.ల భూభాగంలో సంచరిస్తాయని నిపుణుల అంచనా. అందుకే వాటికి విస్తారమయిన అడవేకాక అవిచ్ఛిన్నమయిన అడవి కావాలి.

మన ప్రభుత్వ ఆర్థిక విధానంలో భాగంగా జరుగుతూవున్న అడవుల విధ్వంసనం ఏనుగుల సహజ నివాసాలను నాశనం చేసింది. కలప పరిశ్రమ, ఖనిజ ఉత్పత్తి, ప్రాజెక్టుల నిర్మాణం, కాలవల తవ్వకం, రోడ్ల నిర్మాణం, ప్లాంటేషన్లు, ఇవన్నీ కూడ దేశంలోని అటవీ భూభాగాన్ని కుదించేస్తున్నాయి. వీటికి విలువయిన కర్ర దొంగరవాణా కూడ తోడయింది. ఈ పరిణామాలు ఏదో ఒక మేరకు అభివృద్ధిలో భాగంగా అనివార్యమే, అయితే తత్ఫలితంగా జరిగే అడవుల విధ్వంసనంతో పాటు ప్రయత్నపూర్వకమయిన పునరుజ్జీవనం కూడ జరిగితే దుష్ఫలితాలుండవు. కానీ విధ్వంసనం వల్ల లాభాలుపొందేవారెవ్వరికీ అడవుల పునరుజ్జీవనం తక్షణ అవసరం కాదు. ప్రభుత్వానికీ దీర్ఘకాలిక దృక్పథంగానీ సమగ్ర అభివృద్ధి పథకంగానీ లేదు. దీని ఫలితంగా అడువుల వినాశనం పెరిగేకొద్దీ వన్యప్రాణుల మనుగడ సమస్యాత్మకంగా తయారవుతోంది. అవి జనావాసాల మీదికి వచ్చి ప్రజలకు సమస్యగా తయారవుతున్నాయి.

1984లో ప్రవేశించిన ఏనుగులు 1985 మే నెలదాకా పంటల మీదికీ మనుషుల మీదికీ రాలేదు. అప్పుడు ఎందుకురావడం మొదలుపెట్టాయనేదానికి ఒక కథ ప్రచారంలోనికి వచ్చింది. ఒకనాడు ఆ ఏడు ఏనుగులలో ఒకటి ప్రసవించిందంట. పుట్టిన పిల్లను ఒకచోట వదిలి ఏనుగు మంద మేతకని అడవిలోకి పోయిన సందర్భంలో ఆ ఏనుగుపిల్ల అడవిలోకి మేతకు వచ్చిన పశువులతో కలిసి ఎరికంబట్టు గ్రామంలోకి వచ్చేసింది. గ్రామస్థులకు ఏం చేయాలో అర్థంకాక దానిని పశువులతో బాటు కొట్టంలో ఉంచి పాలు తాగించే ప్రయత్నం చేసారు. అది ఎంతకూ తాగకపోయేసరికి వాళ్ళు సమీపంలోని పేర్నంబట్టు అటవీ అధికార్లకు తెలియజేసారు. వాళ్లు వచ్చి చూసి ఎవరికీ చెందని ఏ వస్తువయినా ప్రభుత్వానికి చెందుతుందనే పాలసీ కింద ఆ ఏనుగు పిల్లను మదరాసు జంతుప్రదర్శనశాలకు అప్పజెప్పారు. అది అక్కడ ఇమడలేక త్వరలోనే చచ్చిపోయిందట.

మేతనుండి తిరిగివచ్చిన 7 ఏనుగులు పిల్ల లేకపోవడం చూసి కోపగించుకున్నాయి. ఏనుగులకు వాటి పిల్లలమీద ప్రేమ ఎక్కువనీ వాటికి ఏ కొంచెం హాని జరిగినా సహించవనీ నిపుణులు అంటారు. అవి కోపంతో అడవిని ధ్వంసం చేయడమేకాక అప్పటినుండీ పొలాల మీదికీ మనుషుల మీదికీ దాడిచేయనారంభించాయనీ కథ. ఈ కథ మొత్తం నిజమే కావచ్చునుగానీ ఈ సంఘటన జరగకపోయినా ఏనుగుల సంఖ్య పెరిగే కొద్దీ అవి ఏదో ఒక రోజు మేతకు పొలాలకు వచ్చేవి. అడ్డం వచ్చిన మనుషుల మీద దాడి చేసేవి.

ఈ విధంగా 1985 మేనెల నుండి పంటలమీదా మనుషుల మీదా ఏనుగుల దాడులు ప్రారంభమయ్యాయి. 1986లో 22 ఏనుగుల రెండవ మంద వీటితో కలిసేసరికి ఈ దాడులు మరిన్ని రెట్లు పెరిగాయి. ఈ అయిదేళ్లలో ఆ ప్రాంతం ప్రజల జీవితమే మారిపోయింది. వాళ్లు పొలంలో చేసే శ్రమ అంతా ఏనుగులకు నైవేద్యం అయింది. ప్రతీ గ్రామంలోనూ ఏనుగులు లక్షల రూపాయల పంటను తిన్నాయి. ధ్వంసం చేసాయి. వాటికి చెరుకు గడలంటే ప్రీతి. పంటను బాగా ఎదగనిచ్చి మొత్తం తినేస్తాయి. రాగి చేనిమీద దాడిచేస్తే మొక్కలు కనీసం విరకుండ కంకి మట్టుకు కొడవలితో కోసినట్లు తినేసిపోతాయి. వరికంకులు తినడమేకాక వరిమళ్లలో పడిపొర్లుతాయి. మామిడితోటలలో కొబ్బరితోటలలో చెట్లూ కొమ్మలూ విరగ్గొట్టి ఆడుకుంటాయి. ఏనుగులకు ఆకలి ఎంత ఎక్కువో క్రీడాభిలాషకూడ అంత ఎక్కువ. రెండు కారణాలగానూ రైతులు ఘోరంగా నష్టపోతున్నారు. కొన్ని నెలల శ్రమను మొత్తం కోల్పోని ఒక్క రైతూ ఆ ప్రాంతంలో లేడు. కొందరయితే పదే పదే నష్టపోతూ వున్నారు.

ప్రాణనష్టమూ విపరీతంగా జరిగింది. ఏనుగుపిల్ల పోయినందుకు కోపంతో మనుషుల మీద దాడి చేసి కొందరిని చంపి ఉండవచ్చును. అయితే పొలం మీద దాడిచేసినప్పుడు కాపలావున్న రైతును చంపిన సంఘటనలే ఎక్కువ. ఏనుగులు చాలా తెలివయిన జంతువులు. పొలం పక్కన చిన్నపాకవుంటే అది కాపలాదారు వుండే పాక అని అనుభవపూర్వకంగా అర్థం చేసుకున్నాయి. అందుకే పొలం మీద దాడిచేసేటప్పుడు ముందు పక్కనున్న పాకను ధ్వంసం చేసి, అందులో మనిషి ఉంటే చంపుతున్నాయి. మొత్తం ఇప్పటికి చనిపోయిన వారిసంఖ్య 30 అని ప్రభుత్వం ప్రకటన. 42 దాకా ఉండవచ్చునని ప్రజల అంచనా.

# నష్టం – నష్టపరిహారం

పౌరహక్కుల సంఘం రాష్ట్ర హైకోర్టులో దాఖలు చేసిన కేసుకోసం 60 గ్రామాలకు చెందిన 630 మంది రైతులనుండి ఏనుగుల వలన వాళ్లకు కలిగిన పంట నష్టం, ప్రభుత్వం ఇచ్చిన నష్టపరిహారం వివరాలను సేకరించి కోర్టుకు తెలిపింది. అందులో ఒక్క గ్రామం వివరాలు మచ్చుకు ఇస్తున్నాం. ఈ నష్టం మూడు పంట సీజన్లలో (1984–87) జరిగింది.

గ్రామం : ఆరిమాచిపెంట    పంచాయతి : పెద్దూరు    మండలం : రామకుప్పం

| రైతు పేరు | నష్టపోయిన పంట | నష్టం విలువ (రూపాయలు) | నష్ట పరిహారం (రూపాయలు) |
|---|---|---|---|
| తిమ్మప్ప (60) తండ్రి కదిరప్ప | వరి, పప్పుధాన్యాలు | 8450 | 750 |
| చిన్న కన్నప్ప (40) తండ్రి మునెప్ప | వరి, పప్పుధాన్యాలు | 10720 | -- |
| వెంకటస్వామి (35) తండ్రి మునుస్వామి | వరి, పప్పుధాన్యాలు | 12000 | -- |
| కన్నప్ప (35) తండ్రి మునెప్ప | వరి, పప్పుధాన్యాలు | 3300 | -- |
| దొరస్వామి నాయుడు (60) తండ్రి గవిరి నాయుడు | వరి, పప్పుధాన్యాలు | 2200 | -- |
| వేటస్వామి (35) తండ్రి కరెప్ప | వరి | 7200 | -- |
| మునుస్వామి (50) తండ్రి కరెప్ప | వరి | 4400 | -- |
| కన్నయ్య (50) తండ్రి కరెప్ప | వరి | 4000 | -- |
| కుట్టమ్మ (30) భర్త తోటిహనుమప్ప | వరి, పప్పుధాన్యాలు | 5400 | -- |
| హనుమంతు (37) తండ్రి కదిరప్ప నాయుడు | వరి, పప్పుధాన్యాలు | 1700 | 750 |
| మునుస్వామి (32) తండ్రి గౌరప్ప | వరి, పప్పుధాన్యాలు | 10000 | -- |
| బట్టెప్ప (20) తండ్రి మల్లప్ప | వరి, పప్పుధాన్యాలు | 30000 | -- |
| గజ్జప్ప (60) తండ్రి మూలప్ప | వరి | 9600 | -- |
| మునుస్వామి (50) తండ్రి మునెప్ప | వరి | 4400 | -- |
| వీరప్ప (35) తండ్రి చిన్నప్ప | వరి, మల్బెర్రితోట | 11000 | -- |
| ఇందప్ప (22) తండ్రి కొర్రెప్ప | వరి | 3000 | -- |
| శంకరాచారి (40) తండ్రి రంగాచారి | వరి | 1200 | -- |
| గంగప్ప (55) తండ్రి గజ్జప్ప | వరి | 6000 | -- |
| నాగినేని స్వామియప్ప తండ్రి మునుస్వామి | వరి, కొబ్బరి | 11200 | 1000 |
| | మొత్తం 19 మంది రైతుల నష్టం – నష్ట పరిహారం * | 1,45,770 | 2500 |

## ఏనుగులు తొక్కి చంపింది ఎంతమందిని, వాళ్లెవరు ...

ఇప్పటికి 30 మంది ఏనుగుల వాతపడి చనిపోయారని ప్రభుత్వం అంటుంది. 42 మంది చనిపోయారని ప్రజలంటారు. మొట్టమొదటి మృతుడు వి. కోట మండలం మద్దిమాకులపల్లెకు చెందిన మూగాచారి. ఆఖరివాడు (ఇప్పటికి) వెంకటాచలం అనే వృద్ధుడు. పలమనేరు మండలం కొలమాసనపల్లి పంచాయితీలోని దొడ్డిపల్లె సమీపంలో 1990 నవంబర్ 5 సాయంత్రం 7 గంటలకు పొలం దగ్గర కాపలా ఉన్న ఇతనిమీద 3 ఏనుగులు దాడిచేసి చంపాయి. చనిపోయిన వారంతా అడవిలో దొంగతనంగా కట్టెకొట్టుకొనడానికో లేక చట్టవ్యతిరేక కార్యకలాపానికో పోయి ఏనుగులవాత పడినవారేనని, చట్టబద్ధంగా బ్రతికే వాళ్లకు ఏనుగుల బెడదలేదనీ ప్రభుత్వం హైకోర్టు ముందు ఇచ్చిన సమాధానంలో అనింది. చనిపోయిన వారందరి వివరాలూ మాకు దొరకలేదుగానీ దొరికిన మేరకు ఇక్కడిస్తున్నాం. ఒకే ఒక మినహాయింపుతో అందరూ చట్టబద్ధంగా బ్రతుకు గడుపుతుండగా చనిపోయారని ఈ పట్టిక తెలుపుతుంది. అయినా పోలీసులను వెనకేసుకొచ్చినట్టే ఏనుగులనూ వెనకేసుకురావడం ఏమిటి!

| పేరు | ఊరు (మండలం) | ఏ విధంగా చంపింది |
|---|---|---|
| భీమానాయక్ | నరియాల (రామకుప్పం) | వేరుశెనగ చేనుకు కావలా ఉండగా చంపాయి. |
| బోనన్నగారి బోడన్న | బోయచిన్నాగపల్లి (వి.కోట) | చేనుకు కావలాఉండగా చంపాయి. |
| బైసేగౌడ (ఇంటర్ విద్యార్థి) | లింగంలరిపల్లి (బైరెడ్డిపల్లి) | ఊరిబయట ఏనుగుల మంద ఉందని తెలిసి చూడడానికి 15 మంది యువకులు వెళ్లారు. ఏనుగులు వాళ్లమీద దాడిచేయగా ఇతను చనిపోయాడు. |
| రంక్యమ్మ | నారాయణపురం (రామకుప్పం) | తనవూరినుండి బస్సు కోసం నరియాలకు పోతూండగా దారిలో ఏనుగు దాడిచేసి చంపింది. |
| తొట్టెప్ప | వీర్నమల (రామకుప్పం) | పొలంనుండి ఇంటికి తిరిగి వస్తుండగా దారిలో ఏనుగు దాడిచేసి చంపింది. |
| సేటప్ప | సింగసముద్రం (రామకుప్పం) | వీర్నమలనుండి తన ఊరికి అడవి మార్గాన వస్తూండగా ఏనుగులు దాడిచేసి చంపాయి. |
| మునిరావు | పాలరేవుగడ్డ (రామకుప్పం) | జొన్న చేనుకు కావలా ఉండగా దాడిచేసి చంపాయి. |
| దశరథరావు (రామకుప్పం) | పాలరేవుగడ్డ వున్నాడు. | పొలంపక్కన గుడిసెలో పండుకొని ఏనుగులు గుడిసెను ధ్వంసం చేసి అతన్ని చంపాయి. |
| మునెప్ప | దాసయ్య గవునూరు (కుప్పం) | వేరుశెనగ చేనుకు కావలా ఉండగా ఒక ఏనుగు ఎత్తి రాళ్లమీద పడేసి చంపింది. |
| తుండుమప్ప | కంగుంది (కుప్పం) | ఇంట్లో పెళ్లి వుంటే కట్టె తెచ్చుకుందామని అడవిలోకి వెళ్లాడు. ఈ 'చట్టవ్యతిరేక' మయిన పనిలో ఉండగా ఏనుగులు దాడిచేసి చంపాయి. |
| చెంగ్రాలాయప్ప | కక్కునూరు (బైరెడ్డిపల్లి) | రాగిచేనుకు కావలా ఉండగా ఏనుగులు దాడిచేసి చంపాయి. |
| పెదవెంకటప్ప | వెంగంవారిపల్లి (బైరెడ్డిపల్లి) | మేతకై అడవిలోకి పోయిన పశువుల కోసం వెళ్లాడు. దారిలో ఏనుగులు దాడిచేసి చంపాయి. |

## ప్రభుత్వం వైఖరి

ఇది మొదటినుండీ ఏనుగులు తిరగాడే అడవి అయివుంటే ప్రజలు వాటికి అలవాటు పడి ఉండేవారు. వాటి ఉనికికి అనుగుణమయిన వ్యవసాయ పద్ధతులూ జీవన విధానమూ అలవర్చుకొని ఉండేవారు. అట్లాకాక అకస్మాత్తుగా ఈ జంతువుల దాడి ప్రారంభమయ్యేసరికి వాళ్లకేమీ పాలుపోలేదు. భయంభయంగా బ్రతకసాగారు. సాయంత్రమయితే గ్రామ పరిసరాలు నిర్మానుష్యం కాసాగాయి. రాత్రంతా బిక్కుబిక్కుమంటూ ఇంట్లో గడిపి పొద్దున్న లేచి పొలం ఎంత తినిపోయాయో చూసి రావడం దినచర్య అయింది. దానితో బాటు ప్రతిఘటన కూడ నేర్చుకొంటున్నారు. ప్రధాన ఏనుగు బాధిత ప్రాంతమయిన కుప్పం, రామకుప్పం, బైరెడ్డిపల్లి, వెంకటగిరి కోట (వి. కోట), పలమనేరు, బంగారుపాళ్యం మండలాలలో ఒక రకమయిన ప్రజల 'ఇంటెలిజెన్స్ నెట్‌వర్క్' ఏర్పడింది. ఏనుగులు ఏ మండలంలో తిరుగుతున్నాయో అన్ని మండలాలలోనూ తెలుస్తుంది. అవి ఒక ప్రాంతం నుండి ఇంకొక ప్రాంతానికి మకాం మారిస్తే వెంటనే అందరికీ తెలిసిపోతుంది. ఏనుగుల అలవాట్లనూ మనస్తత్వాన్నీ గమనించడం నేర్చుకున్నారు. అవి శబ్దానికి జడుస్తాయని తెలుసుకొని, ఊరిబయట ఏనుగుల మందగానీ వుంటే గట్టిగా టపాకాయలు కాల్చడం, సుగాలీ (లంబాడా) తండాల వాళ్లయితే నాటు తుపాకులు ఒక్కసారిగా గాలిలోకి పేల్చడం, తప్పెట్లతో గట్టిగా శబ్దాలు చేయడం, లేకపోతే అందరూ కలిసి ఒక్కసారిగా అరవడం నేర్చుకున్నారు. నైరాశ్యం, ధైర్యం, కర్మతత్వం, ప్రతిఘటన, వీటి మధ్య ఊగిసలాడుతూ బ్రతుకుతున్నారు.

**ప్రధాన ఏనుగుబాధిత ప్రాంతం (1981 జనాభా లెక్కలు)**

| | |
|---|---|
| రామకుప్పం మండలం (చిత్తూరు పశ్చిమ అటవీ డివిజన్) | |
| మొత్తం భూవైశాల్యం | 38047 హెక్టార్లు |
| అందులో అడవులు | 23978 హెక్టార్లు (63%) |
| 38 గ్రామాలు, జనాభా 34210 | |
| వెంకటగిరికోట (వి. కోట) మండలం (చిత్తూరు పశ్చిమ అటవీ డివిజన్) | |
| మొత్తం భూ వైశాల్యం | 27751 హెక్టార్లు |
| అందులో అడవులు | 8705 హెక్టార్లు (31%) |
| 34 గ్రామాలు, జనాభా 48531 | |
| బైరెడ్డిపల్లి మండలం (చిత్తూరు పశ్చిమ అటవీ డివిజన్) | |
| మొత్తం భూవైశాల్యం | 24299 హెక్టార్లు |
| అందులో అడవులు | 7976 హెక్టార్లు (33%) |
| 25 గ్రామాలు, జనాభా 36200 | |
| పలమనేరు మండలం (చిత్తూరు పశ్చిమ అటవీ డివిజన్) | |
| మొత్తం భూవైశాల్యం | 21176 హెక్టార్లు |
| అందులో అడవులు | 11626 హెక్టార్లు (55%) |
| 17 గ్రామాలు, జనాభా 45225 | |
| కుప్పం మండలం (చిత్తూరు పశ్చిమ అటవీ డివిజన్) | |
| మొత్తం భూవైశాల్యం | 30999 హెక్టార్లు |
| అందులో అడవులు | 20067 హెక్టార్లు (65%) |
| 64 గ్రామాలు, జనాభా 64188 | |
| బంగారుపాళ్యం మండలం (చిత్తూరు తూర్పు అటవీ డివిజన్) | |
| మొత్తం భూవైశాల్యం | 28184 హెక్టార్లు |
| అందులో అడవులు | 8097 హెక్టార్లు (29%) |
| 27 గ్రామాలు, జనాభా 50590 | |

***..... ఇది ప్రధాన బాధిత ప్రాంతం. మొత్తం 15 మండలాలలో ఏనుగుల సంచారం ఉంది.***

చిన్న జంతువులయితే వాటిని శాశ్వతంగా తరిమేద్దురేమోగానీ ఏనుగుల ముందు మనుషులు ఎంతయినా బలహీనులే. ఒకవేళ బలంతెచ్చుకొని వాటికి హాని కలిగిస్తే అది చట్టం ప్రకారం నేరం. ప్రభుత్వం అటవీ విధానం ఫలితంగా ఏనుగులు ప్రజలపైన దాడులు చేస్తే దానికి ప్రభుత్వం బాధ్యత వహించదు గానీ ప్రజలు కోపంకొద్దీ ఏనుగులను ఏమయినా చేస్తే మట్టుకు వాళ్లమీద కేసులు పెడుతుంది. ఏనుగును హత్యచేసి జైలుకు పోయిన రైతు ఒకడు ఉన్నాడు.

*వి. కోట మండలంలోని ఎగుడు, దిగుడు నేలల్లో ఒక ఇరుకైన లోయలో ఉంది 'వీరగురమ్మ తోపు' అనే కుగ్రామం. ఆ గ్రామానికి పక్కనే ఓ చిన్న మడుగుంది. నీళ్ళు తాగడానికి ఆ మడుగు దగ్గరికి వచ్చేపోయే ఏనుగులు ఆ ఊరి పొలాలను పదేపదే ధ్వంసం చేస్తున్నాయి. ప్రతీ పంటా నాశనం అవుతూ వుంటే కడుపు మండిన వెంకటేశు అనే రైతు ఏనుగుల మీద ప్రతీకారం తీర్చుకోదల్చుకున్నాడు. వన్యమృగాల సంరక్షణ చట్టం ఒకటుందని, ఆ చట్టంకింద తాను నేరస్థుడవుతాడని అతనికి తెలియదో, తెలిసీకూడా ఫరవాలేదనుకున్నాడో గాని, తన ఊరి పక్కగా పోయే హైటెన్షన్ లైన్నుండి కరెంటులాగి ఏనుగుల దారికడ్డంగా ఇనపతీగ పెట్టాడు. ఒక ఏనుగు ఆ తీగ మీద కాలుబెట్టి షాక్ తగిలి కిందబడి చనిపోయింది. ఇది జరిగింది 1989 ఆగస్ట్ 16వ తేదిన. ఈ వార్త బయటికి పొక్కగానే చుట్టుపక్కల గ్రామాల ప్రజలంతావచ్చి వెంకటేశు నాయకత్వంలో చచ్చిన ఏనుగుకి బొట్లుపెట్టి, దాని కళేబరాన్ని పూలతో అలంకరించి దానికి కర్మ చేసినంత పనిచేశారు.*

*అంతలో పోలీసులు వచ్చి వెంకటేశుని అరెస్టుచేసి వన్యప్రాణుల సంరక్షణ చట్టం సెక్షన్ 9(2) కింద కేసుపెట్టి జైలుకి పంపించారు.*

మరి ప్రభుత్వం ఏం చేస్తూ వుంది? 1987 దాకా అసలు పట్టించుకోలేదు. అంతగా సామాజికంగా రాజకీయంగా చైతన్యవంతమయిన ప్రాంతం కాదు కాబట్టి ఈ జనం కష్టాలను ఎవ్వరూ పట్టించుకోలేదు. కానీ క్రమంగా ఒత్తిడి పెరిగే కొద్దీ ప్రభుత్వం కొద్దికొద్దిగా మేలుకోసాగింది. ఏనుగుల రాకకు తనదే బాధ్యత అని ఒప్పుకునే బదులు అది ప్రకృతి సిద్ధమయిన విషయమయినట్టు మీ జాగ్రత్త మీరే చూసుకోండి అని ప్రచారం చేసింది. అటవీశాఖాధికార్లు కరపత్రాలు వేసారు, సినిమా టాకీసులలో స్లైడ్లు వేయించారు. ఏనుగులు 'స్వాములవారు' అని భావించే ప్రజల మూఢనమ్మకాలను ఈ ప్రచారంలో సిగ్గువిడిచి వాడుకున్నారు.

చనిపోయిన వారి కుటుంబాలకు, నష్టపోయిన పంటకు, నష్టపరిహారం ఇవ్వడం కూడ ప్రారంభించారు. ఈ నష్టపరిహారాన్ని గురించి ప్రభుత్వం ఘనంగా చెప్పుకుంటూ వుంది కాబట్టి ఇది ఏ పరిమాణంలో వుందో స్పష్టంగా తెలుసుకోవాలి. ఏనుగుల బెడద తీవ్రంగా వున్న గ్రామాలు దాదాపు 100 ఉన్నాయి. పౌరహక్కుల సంఘం హైకోర్టులో కేసువేయడం కోసం 60 గ్రామాలు తిరిగి 630 మంది రైతుల దగ్గర వాళ్ళకు జరిగిన పంటనష్టాన్ని గురించి సమాచారం సేకరించింది. కేసు 1988లో వేసాము. ఆనాటికే సగటున ఒక్కొక్క గ్రామంలో 1 లక్ష రూపాయల దాకా పంట నష్టం అయిందని గమనించాము. ఆ తరువాత కూడ ఏనుగుల దాడి పెద్ద ఎత్తున జరిగినప్పుడల్లా గ్రామాలకు పోయి సమాచారం సేకరిస్తున్నాము. ఇప్పటికి మొత్తం పంట నష్టం (అన్ని గ్రామాలలో కలిపి) 2 లేక 3 కోట్ల రూపాయలుంటుంది. ఇందుకు ప్రతిగా ప్రభుత్వం 1989 ఏప్రిల్ నెలదాకా ఇచ్చిన మొత్తం నష్టపరిహారం కేవలం 6 లక్షల 28వేల రూపాయలు మాత్రమే. ఇది పౌరహక్కుల సంఘం అంచనా కాదు. చిత్తూరు (పశ్చిమ) డివిజన్ అటవీశాఖాధికారి అధికారికంగా ఇచ్చిన ప్రకటన. 1990 సెప్టెంబర్ నాటికి ఈ సంఖ్య 7 లక్షల 65 వేలకు పెరిగిందని ఇండియన్ ఎక్స్‌ప్రెస్ దినపత్రికలో 27/7/1990 నాడు వచ్చిన వార్తను బట్టి తెలుస్తూ వుంది.

వరి, చెరుకు వంటి పంటలకే తప్ప జొన్న, వేరుశెనగ వంటి మెట్టపంటలకు నష్టపరిహారం లేదు. మామిడి, కొబ్బరితోటలకు నష్టపరిహారం లేదు. ఇళ్లూ, నీళ్లపైపులూ ధ్వంసమయితే నష్టపరిహారం లేదు. వరి, చెరుకు పంటలకు ఇచ్చే నష్టపరిహారం ఖర్చుకు కూడ రాదు. మొదట్లో వరిపంటకు ఎకరానికి 250 రూపాయలు, చెరుకుపంటకు 500 రూపాయలు ఇచ్చేవారు. అది మరీ తక్కువ అని రైతులు గొడవ చేయగా వరిపంటకు 500 రూపాయలు, చెరుకు పంటకు 1250 ఇవ్వసాగారు. చనిపోయిన వారికి ఎక్స్‌గ్రేషియా 10000 ఇస్తున్నారు. ఒక ఎకరం పంటకు అయ్యే ఖర్చుతో ఈ నష్టపరిహారాన్ని పోల్చి చూస్తే ఇది ఎంత తక్కువో అర్థమవుతుంది. చిత్తూరు జిల్లాలో వున్న ధరలలో 1 ఎకరం వరిపంటకు మొత్తం 4500 రూ॥లు పైగా ఖర్చవుతుంది. సగటుధర పలికితే ఖర్చులు పోను నికర ఆదాయం 2000 పైగా ఉంటుంది. అదే విధంగా చెరుకుపంట ఎకరానికి 6000 పైగా ఖర్చు అవుతుంది. బెల్లం చేసి అమ్మితే నికర ఆదాయం 5000 పైగా ఉంటుంది. అంటే ప్రస్తుతం ప్రభుత్వం ఇస్తున్న నష్టపరిహారం ఖర్చులో 10 నుండి 20 శాతం మట్టుకే ఉంది. అది కూడ ఈ రెండు పంటలకే. మెట్టపంటలకు అసలేమీ ఇవ్వడం లేదు.

ఈ మాత్రం నష్టపరిహారానికి కూడా రైతులను చాలాసార్లు తిప్పించుకుంటారు. పంట నష్టపోయిన రైతు దాఖలాలు

మాసిపోయేలోపల మండల రెవెన్యూ ఆఫీసరుగారికి లిఖిత పూర్వకంగా అర్జీ పెట్టుకోవాలి. ఆయన దాన్ని విలేజి అసిస్టెంట్లకు, ఆర్.ఐ లకు పంపుతాడు. వాళ్ళు పంట నష్టాన్ని మదింపువేసి రిపోర్టు పంపుతారు. దానిని ఎం.ఆర్.ఒ పరిశీలించి కలెక్టరు కార్యాలయానికి చేరుస్తారు. అక్కడ మళ్ళీ అది శల్యపరీక్షకు గురైన తరువాత జిల్లా కలెక్టరు ప్రకృతి వైపరీత్యాల చట్టంక్రింద నిధులు మంజూరుచేసి సంబంధిత డివిజినల్ ఫారెస్టాఫీసరుకు పంపిస్తాడు. ఆ అటవీశాఖాధికారి నష్టపరిహారాన్ని డిమాండ్ డ్రాఫ్ట్ రూపంలో స్థానిక శాసన సభ్యులు, లేక మండలాధ్యక్షుల సమక్షంలో బాధితులకు చెల్లిస్తాడు. చివరికి వచ్చే పరిహారానికి, జరిగిన నష్టంతో పొంతన లేకపోవడమే కాక కాలయాపన కూడా చాలా అవుతుంది. రామకుప్పం మండలం, పంద్యాలమడుగుకు చెందిన పూజారి కర్రెప్ప అనే రైతు వరిపొలాన్ని ఏనుగులు నాశనం చేసిపోగా పై అధికార్లంతా కల్సి కేవలం నలభైసెంట్ల భూభాగంలో కొద్దిగా పెరిగిన పంట మాత్రమే నష్టమైందని చెప్పి, కేవలం 20 రూపాయల నష్టపరిహారం మంజూరుచేసి అతనికి డి.డి. ఇచ్చారు. దాన్ని రొక్కంగా మార్చుకోడం కోసం కుప్పం వెళ్లిరావడానికి అతనికి బస్ ఛార్జీయే 14 రూపాయలయింది!

ఒక్కొక్కసారి ఈ జాప్యం ఎంతుంటుందంటే పెట్టుకున్న అర్జీకి సమాధానం రాకముందే అదే పొలంలో మళ్ళీ పంటవేయడం, దాన్నికూడా ఏనుగులు తొక్కిపోవడం జరుగుతుంది. దీనితో విసుగొచ్చి చాలామంది రైతులు పిటిషన్లు పెట్టుకోవడమే మానేశారు. ఫలితంగా ఈ మధ్య కాలంలో రిపోర్టుకాని పంటనష్టం చాలావుంది.

నష్టపరిహారం ప్రహసనం ఇట్లావుంటే ఏనుగుల రాకపోకలను నిరోధించడానికి విద్యుదీకరించబడిన కంచెను నిర్మించడానికి ప్రభుత్వం పూనుకుంది. అడవికి అడ్డంగా ఇప్పటికి యాభైఆరు కిలోమీటర్ల పొడవునా 12 లక్షల ఖర్చుతో కంచెను నిర్మించారు. మరొక 25 కిలోమీటర్లు పొడిగించబోతున్నారు. దేశంలో ఇంతపొడవైన విద్యుత్‌కంచె ఎక్కడా లేదని రాష్ట్రప్రభుత్వం పౌరహక్కుల సంఘం హైకోర్టులో వేసిన పిటిషన్‌కు సమాధానం చెప్తూ చెప్పింది. అది నిజమే కావచ్చుగాని, ఆ కంచె ఏనుగులను ఆపడంలో సఫలం కాకపోతే బాధితులకి వచ్చిన సంతోషం ఏమీలేదు. ఆ కంచె పూర్తిగా విఫలం అయిందని ఇప్పుడు ప్రభుత్వమే ఒప్పుకోక తప్పదు.

ఈ కంచెకు 'గజ నిరోధక విద్యుత్ కంచె' అని పేరు పెట్టారు. ఎక్కువ ఓల్టేజితో బలహీనమయిన కరెంటు సెకండులో పావువంతు ప్రవహిస్తుంది. (పల్సేటింగ్ కరెంట్) ఈ కంచెను తాకితే ఏనుగులకు చురుక్కుమని షాక్ తగిలి అవి దూరం వెళ్ళిపోతాయని ప్రభుత్వం ఉద్దేశ్యం. ఇది ఏనుగులను భౌతికంగా ఆపడానికి కాదని, మానసికంగా నిరుత్సాహపరచడానికేనని ప్రభుత్వమే చెబుతోంది. కాని అటువంటి ఫలితమేమీ దక్కలేదు. కంచెను నిలబెట్టడానికి ఉపయోగించిన రాతి స్థంభాలను ఏనుగులు కాలితో తన్ని కంచెను కూల్చేస్తున్నాయి. తమ పశువులను అడవిలో మేపుకోడానికి కంచె అడ్డం వస్తోందని ప్రజలే కొన్ని చోట్ల కంచెను పీకేస్తున్నారు. ఈ చర్యే కంచె వైఫల్యానికి కారణమని ప్రభుత్వం దుష్ప్రచారం చేస్తోంది కాని, కంచె నిర్మాణంలోనే లోపంవుంది. అడవి మొత్తం ఒకవైపు ఊర్లుమొత్తం ఒకవైపు వుంటే ఊళ్ళకి, అడవికి మధ్య కంచె వేయొచ్చు. కాని అడవి అంతటా ఊళ్ళున్నప్పుడు కంచె ఎక్కడ వేసినా రెండు వైపులా అడవే వుంటుంది. ఊర్లు వుంటాయి. కాకుండా ఈ అడవిగుండా నిలువుగా మూడు రహదార్లు చిత్తూరునించి తమిళనాడుకి పోతాయి. ఒకటి : పలమనేరు నుండి గుడియాట్టం పోయే రోడ్డు. రెండోది : రామకుప్పంనుండి వానియంబాడి పోయే రోడ్డు. మూడోది : వెంకటగిరి కోట నుండి పేర్నంబట్టుకు పోయేరోడ్డు. ఈ మూడు రోడ్ల మీదుగా నిత్యం వాహనాలు ప్రయాణం చేస్తూ వుంటాయి. వీటిలో రెండో రోడ్‌ను మద్రాసు - బెంగుళూరుల మధ్య ప్రత్యామ్నాయ జాతీయ రహదారిగా రూపొందించే ప్రతిపాదన కూడా వుంది. ఈ రోడ్లకడ్డంగా కంచె వేయడానికి వీలులేదు. నిజానికి ఇప్పటికి వేసిన కంచె ఈ రహదార్లకు ఖాళీ వదిలేసింది. కాబట్టి ఈ కంచె ఏ విధంగ చూసినా ఘోరంగా విఫలమయిందనే చెప్పాలి.

## పౌరహక్కుల సంఘం కేసు

ఈ పరిస్థితిలో పౌరహక్కుల సంఘం చిత్తూరు జిల్లా శాఖ 1988 తొలిరోజుల్లో ఏనుగు బాధిత ప్రాంతాల్లో అనేక గ్రామాలు తిరిగి ప్రాణ నష్టాన్ని గురించి, పంట నష్టాన్ని గురించి సమాచారం సేకరించింది. అరవై గ్రామాలకు చెందిన 630 మంది రైతుల దగ్గర అఫిడవిట్లు సేకరించి హైకోర్టులో రిట్ పిటిషన్ వేసింది. (ఎం.ఎస్. బాలాజీ వర్సస్ స్టేటాఫ్ ఆంధ్రప్రదేశ్, రిట్ పిటిషన్ నెం. 17746/88) ఏనుగుల బెడదగురించి సమగ్రమైన నివేదిక సమర్పించడానికి నిపుణుల కమిటీని ఏర్పాటు చేయవల్సిందని, ఆ నిపుణుల కమిటీ నివేదికననుసరించి నివారణ చర్యలు ప్రభుత్వానికి ఆదేశించవల్సిందని, పంటనష్టానికి, ప్రాణనష్టానికి న్యాయమయిన నష్టపరిహారం ఇప్పించవల్సిందని కోర్టుని పౌరహక్కుల సంఘం కోరింది.

## ఏనుగుల బాధితులకు అటవీశాఖ హితవు చెప్తూ విడుదల చేసిన కరపత్రం

## కుప్పం, పలమనేరు, పుంగనూరు మరియు బంగారు పాళ్యం రేంజి అడవుల సమీప గ్రామ ప్రజలకు విజ్ఞప్తి

మన అడవులలో గత మూడు సంవత్సరములుగా ఏనుగులు సంచరిస్తున్నది మీకు తెలిసిన విషయమే. కానీ కొందరు అజాగ్రత్తగా నిర్లక్ష్యముగా ప్రవర్తించినందువలన ప్రాణములు కోల్పోయినారు.

పై విషయములను పురస్కరించుకొని కొన్ని సూచనలు ఇవ్వడమయినది.

1. అడవులలో తిరుగు పశువుల కాపరులు తప్పనిసరిగా తెల్లగుడ్డలు వేసుకోరాదు.
2. పశువుల కాపరులు అడవిలోనికి వెళ్లరాదు. బైనుపక్కనే మేపుకొనవలెను.
3. పశువుల కాపరులు సాయంత్రం సమయంలో అతి జాగ్రత్తగా వుండవలెను. ఏనుగులు అడవి నుండి పొలములకు వచ్చునప్పుడు మీరు ఎదురయిన అవి హాని చేయవచ్చును.
4. అకస్మాత్తుగా ఎదురయిన పరుగెత్తవలయును. అంతేగాని వాటిని తరుముటకు ప్రయత్నించిన మీకు హాని జరగవచ్చును.
5. అటవీ సంపద దొంగిలించుటకు పోయి ఏనుగుల వలన నష్టపోయిన వారికి ప్రభుత్వం నుండి ఎలాంటి సహాయం అందదు.
6. మీరు నష్టపోయిన పంటలకు త్వరలో నష్టపరిహారము చెల్లించెదరు.
7. ఏనుగులు దేవతా జంతువులు. వాటిని కాపాడుట మన కర్తవ్యము.
8. ఏనుగులకు హాని తలపెట్టిన చట్టరీత్యా శిక్షార్హులు.
9. అడవి సమీపంలో ఏనుగులు ఎవరికయినా కనబడిన వెంటనే సమీపములోని గార్డు వాచర్లకు తెలియజేయవలయును.
10. ముఖ్యముగా రాత్రులందు రైతులు చెరుకు గానుగల వద్ద నుండు సమయమున అగ్గి మంటలు వేసుకొని జాగ్రత్తగా మేల్కొని ఉండవలయును.

కావున ప్రజలు పై సూచనలను గమనించి అప్రమత్తముగా ఉండి అటవీశాఖతో సహకరించవలయును.

పై ఏనుగుల వలన ఏ విధమయిన నష్టము వాటిల్లినను తక్షణమే సమీప స్థానిక అటవీ అధికారికి తగు సహాయము నిమిత్తము తెలియజేయవలసిందిగా కోరడమైనది.

ఇట్లు
అటవీశాఖ అధికారి
చిత్తూరు (పశ్చిమ)

ప్రభుత్వం సమాధానం చెప్తూ ఇంతకంటే నష్టపరిహారం వేరే ఏ రాష్ట్రంలోనూ ఇవ్వడం లేదని, ఇంత పొడుగు కంచె ప్రపంచంలో ఎక్కడా లేదని అంది. ఇంకా హాస్యాస్పదంగా ఏనుగులు తొక్కి చంపిన వాళ్ళందరూ కూడా కలపదొంగతనం కోసమో, వేరే ఏదో దుర్బుద్ధితోనో అడవికిలోకి వెళ్ళిన వాళ్ళేనని చట్టబద్ధంగా బతుకుతున్న వాళ్ళకి ఏనుగుల వల్ల ఏం ప్రమాదం లేదని చెప్పింది.

దీర్ఘకాలికంగా ఈ ఏనుగుల సమస్య ప్రభుత్వ అటవీ విధానంతో ముడిపడి వున్నదెనప్పటికీ తక్షణ పరిష్కార చర్యలు లేకపోలేదు.

1. జనావాసం లేని దూరప్రాంత అడవులకు ఏనుగులను తరిమి వేయవచ్చును. ఉదాహరణకు : తమిళనాడులో ఒక ఏనుగుల మందను ఈ మధ్యనే 600 వందల కిలోమీటర్ల దూరానవున్న మధుమలై అడవులలోకి తరిమేశారు. కర్నాటకలో 11 ఏనుగుల మందను కూర్గ్ అడవులలోకి తరిమారు. బీహార్‌లోని రాంచి జిల్లాలో ఇదే విధంగా ఏనుగులను అడవిలోకి తరిమారు.

ఈ విధంగా తరమడంలో నైపుణ్యంగల వ్యక్తులు దేశంలో వున్నారు. కర్నాటక రాష్ట్రానికి చెందిన కొందరు నిపుణులతో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం సంప్రదింపులు జరిగిందిగాని, ఏ కారణంవల్లనో ఈ పనిని వాళ్ళకి అప్పగించలేదు.

2. అభయారణ్యం : అనుకూలమైన ప్రదేశాన్ని చూసి అక్కడ ఏనుగులకు ఆహారవసతి నీటివసతి కల్పించి అభయారణ్యాన్ని రూపొందించి ఈ ఏనుగులను అక్కడికి తరమవచ్చును.

3. ఒకే ఒక పొడవైన కంచె కాకుండా ప్రతి గ్రామంచుట్టూ కంచె వేయవచ్చును. పశువులు రావడానికి పోవడానికి సౌకర్యం కల్పించి, ఏనుగులను మాత్రం ఆపే విధంగా దాన్ని రూపొందించవచ్చును.

4. నష్టపరిహారం కంటితుడుపుగా కాక న్యాయమైనదిగా ఉండాలి. ఖర్చు, దిగుబడి, తిరిగిమళ్ళీ పంటవేసే అవకాశం వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకోవాలి. వరి, చెరకు పంటలకే కాక జొన్న వేరుశనగ వంటి మెట్ట పంటలకు, మామిడి, కొబ్బరితోటలకు, ఇళ్ళు, గోడలు, బావులు వంటి స్థిరాస్తులకు కూడా నష్టపరిహారం ఇవ్వాలి.

5. ఏనుగులను తరిమివేయడానికి కొంతకాలం పడుతుంది కాబట్టి, అంతవరకూ న్యాయమైన నష్టపరిహారం ఇప్పించడానికి పంటభీమా పథకాన్ని ప్రవేశపెట్టాలి. ఖర్చేకాకుండా నికరాదాయంలో 80% రైతుకు వచ్చేటట్టు భీమాపథకాన్ని రూపొందించాలి. ప్రకృతి వైపరీత్యాల పంటభీమా పథకాలు కొన్ని ఈ రకమైనవి వున్నాయి. అప్పుడు ఉదాహరణకు చెరకు పంట ఒక ఎకరం నష్టమయితే ప్రస్తుతం ఇస్తున్న 1200 నష్టపరిహారంకాక మొత్తం 10,000 రూపాయల నష్టపరిహారం వస్తుంది. ఇతర పంటలకు కూడా ఇదే దామాషాలో నష్టపరిహారం వస్తుంది.

6. ఏనుగుల దాడిలో మనిషి చనిపోతే 10,000 రూపాయల ఎక్స్‌గ్రేషియా కాక సంపూర్ణ నష్టపరిహారం ఇవ్వాలి. ఉదాహరణకు పోలీసు కస్టడీలో చనిపోయిన వారికి కోర్టులు కొన్ని సందర్భాల్లో లక్షరూపాయలకి పైగా నష్టపరిహారం మంజూరు చేశాయి.

ఈ సూచనలను పౌరహక్కుల సంఘం కోర్టుకి ఇచ్చిన సమాధానంలో ప్రతిపాదించింది.

## కౌండిన్య అభయారణ్యం

ఎంతసేపూ గ్రామస్థులమీదేనా తన ప్రతాపం ఒకసారి మంత్రికి కూడా తడాఖా చూపించాలనుకుందేమో ఒక పెద్ద గజరాజు 1990 సెప్టెంబర్, 16 రాత్రి కుప్పం నుంచి చిత్తూరు వస్తున్న అప్పటి పంచాయతీరాజ్ శాఖమంత్రి గౌరవనీయులు చెంగారెడ్డిగారి కారుని అడ్డగించింది. మంత్రిగారేకాక వారి ఎస్కార్టు సైతం తారెత్తి పోయి ప్రాణాలరచేత పెట్టుకున్నారు. కొంతసేపు వారిని ఏడిపించి మళ్ళీ ఏమనుకుందో ఏమో ఏనుగు నిశ్శబ్దంగా అడవిలోకి వెళ్ళిపోయింది. అప్పటి ముఖ్యమంత్రి చెన్నారెడ్డిగారికి ప్రీతిపాత్రుడయిన చెంగారెడ్డి ఈ విషయం తన నాయకుడికి చెప్పగానే అన్ని దినాలుగా లేని కదలిక ప్రభుత్వంలో అకస్మాత్తుగా వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఏనుగులు సంచరించే ప్రాంతాన్ని 'కౌండిన్య అభయారణ్యం'గా ప్రకటించింది. సెప్టెంబరు 25వ తేదీన చెన్నారెడ్డి పలమనేరు దగ్గర శంఖుస్థాపన సైతం చేశాడు.

ఈ అభయారణ్యం కోసం పలమనేరు, బైరెడ్డిపల్లి, వి.కోట, రామకుప్పం, కుప్పం మండలాల్లో 357.6 చదరపు కిలోమీటర్ల అటవీభాగాన్ని కేటాయించారు. 1990 నుంచి 1995 దాకా 1.5 కోట్ల రూపాయల బడ్జెట్‌ను మంజూరు చేశారు. ఇక ఆ 'అభయారణ్యా'న్ని అమలుచేయడమే తరువాయి.

అయితే అభయారణ్యం తయారుచేసినంత మాత్రాన ఏనుగు బాధితుల సమస్యలు తీరిపోవు. అభయారణ్యం జంతువులకు అభయం ఇస్తుంది., వాటి వల్ల బాధితులయిన ప్రజలకి కాదు. జంతువులు ఆ ప్రాంతంలో బతకడానికి కావల్సిన సదుపాయాలన్నీ కల్పిస్తూ అదే సమయంలో అభయారణ్యం పరిసరాల్లో బ్రతికే ప్రజలకు వాటివల్ల నష్టం జరక్కుండా కట్టుదిట్టం చేయాలి. అది మళ్ళీ మరొక నిష్ఫలమైన గజనిరోధక విద్యుత్ కంచె కాకుండా నిజమైన సంరక్షణ కావాలి. మహబూబ్‌నగర్, కర్నూలు జిల్లాలలోని శ్రీశైలం అడవుల్లో ఏర్పరచిన పులుల అభయారణ్యం విషయంలో ఇటువంటి జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్ల ఆ అభయారణ్యం ప్రజలకు భీతావహంగా మారింది. ఇక చిత్తూరులో ఏం జరుగుతుందో చూడాలి.

## ముగింపు

ఏ సంస్కరణ అమలు కావాలన్నా ప్రజలు సంఘటితం కావాలనేది నాలుగు దశాబ్దాల భారత ప్రజాస్వామ్యం మనకువేర్పిన గుణపాఠం. చిత్తూరు జిల్లా ఏనుగు బాధితులు ఇప్పటివరకూ సంఘటితం కాలేకపోయారు. దానికోసం జరిగిన అన్ని ప్రయత్నాలకు స్థానిక పెత్తందార్లు అడ్డం వస్తున్నారు. చివరికి పౌరహక్కుల సంఘం అండకూడ ప్రజలకు దక్కకుండా చేయాలని కుట్రలు పన్నారు. బాధిత ప్రాంతాల రైతులను ,యువకులను కూర్చోబెట్టి ఒక ఐక్య ఆందోళనా వేదికను తయారు చేయాలని పౌరహక్కుల సంఘం ప్రయత్నం చేసింది. అందుకోసం 1989 ఫిబ్రవరి 5వ తేదీన వి. కోటలో సమావేశం ఏర్పాటు చేసింది. అయితే అప్పటి పలమనేరు శాసనసభ్యులయిన మంత్రి సుబ్బయ్యగారి మనుషులూ, పోలీసులూ గ్రామ గ్రామం తిరిగి సమావేశానికి ఎవరూ హాజరు కాకూడదని, అది నక్సలైట్ల సమావేశమని జనాన్ని బెదిరించారు. ఆరోజు ఉదయం తెల్లబట్టల పోలీసులు, తెలుగుదేశం గూండాలు పెద్ద సంఖ్యలో సమావేశ స్థలానికి వచ్చి పౌరహక్కుల సంఘం బాధ్యులను దౌర్జన్యంగా వి. కోట నుండి పంపించేశారు. ఆనాటినుండి ఈ నాటిదాకా ఏనుగు బాధితులను సంఘటితపరిచే ప్రయత్నం ఇక సాగలేదు.


ప్రచురణ : ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం, చిత్తూరు జిల్లా శాఖ

ప్రతులు : 3000 ముద్రణ : ఏప్రిల్ 1991


వెల : 2 రూపాయలు

టైప్ సెట్టింగ్ : ప్రింటిక

ప్రతులకు :

ఎస్.ఎస్.సి. బోస్ (అడ్వకేట్)
పెద్దిబొట్ల వారి వీధి, విజయవాడ - 520 002.

# చిత్తూరు జిల్లా




మన ప్రభుత్వ ఆర్థిక విధానంలో భాగంగా జరుగుతూవున్న అడవుల విధ్వంసనం ఏనుగుల సహజ నివాసాలను నాశనం చేసింది. కలప పరిశ్రమ, ఖనిజ ఉత్పత్తి, ప్రాజెక్టుల నిర్మాణం, కాలవల తవ్వకం, రోడ్ల నిర్మాణం, ప్లాంటేషన్లు, ఇవన్నీ కూడ దేశంలోని అటవీ భూభాగాన్ని కుదించేస్తున్నాయి. వీటికి విలువయిన కర్ర దొంగరవాణా కూడ తోడయింది. ఈ పరిణామాలు ఏదో ఒక మేరకు అభివృద్ధిలో భాగంగా అనివార్యమే, అయితే తత్ఫలితంగా జరిగే అడవుల విధ్వంసనంతో పాటు ప్రయత్నపూర్వకమయిన పునరుజ్జీవనం కూడ జరిగితే దుష్ఫలితాలుండవు. కానీ విధ్వంసనం వల్ల లాభాలుపొందేవారెవ్వరికీ అడవుల పునరుజ్జీవనం తక్షణ అవసరం కాదు. ప్రభుత్వానికి దీర్ఘకాలిక దృక్పథంగానీ సమగ్ర అభివృద్ధి పథకంగానీ లేదు. దీని ఫలితంగా అడ వుల వినాశనం పెరిగేకొద్దీ వన్యప్రాణుల మనుగడ సమస్యాత్మకంగా తయారవుతోంది. అవి జనావాసాల మీదికి వచ్చి ప్రజలకు సమస్యగా తయారవుతున్నాయి.